

ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా రమణారావు



ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్) ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా రాయపూర్ నిట్ డైరెక్టర్ (ఛత్తీస్‌ఘడ్) ప్రొఫెసర్ ఎన్‌వి.రమణారావు నియమితులయ్యారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసిందని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ ఎన్‌వి.రమణారావు గతంలో వరంగల్ నిట్ డైరెక్టర్‌గా పని చేశారు, ఆయన త్వరలోనే ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపడతారని తెలిపారు. ఇప్పటివరకు ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా హైదరాబాద్ ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్.మూర్తి వ్యహహరించారు.

ఇసు(క)గెత్తిపోతున్నారు..!

మాయాపర్వంలా ఇసుక ఆన్‌లైన్ బుకింగ్

ఎప్పుడు చూసినా ఆన్‌లైన్‌లో నో శ్యాండ్ డిస్‌ప్లే

ఏలూరు, పశ్చిమలో ఒక్క ఇసుక ర్యాంపూ తెరవని పరిస్థితి

ఇబ్రహీంపేటలో 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉందని ప్రకటన

ఆన్‌లైన్‌లో మాత్రం నో బుకింగ్..

లబోదిబోమంటున్న నిర్మాణదారులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం చెబుతున్న ఉచిత ఇసుక సరఫరా బూటకమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక సామాన్యులకు అందని ద్రాక్షగా మారిపోయింది. గతంలో ఎన్నడూ ఇటువంటి దారుణ పరిస్థితులను ఎదుర్కోలేదనే చర్చ జనాల్లో సాగుతోంది. ప్రభుత్వం, జిల్లా అధికారులు చెబుతున్న మాటలకు, వాస్తవ పరిస్థితికి ఎటువంటి సంబంధమూ లేకుండాపోతుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజానీకం ఇసుక కోసం ఆన్‌లైన్ సెంటర్ల చుట్టూ తిరిగితిరిగి విసుగెత్తిపోతున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఓపెన్ ఇసుక ర్యాంపులు ప్రారంభిస్తున్నాం, ఇక ఇసుక కష్టాలు ఉండవని ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ వట్టి మాటలుగా మారిపోయాయి. ఇసుక బుకింగ్ కోసం జనం పడుతున్న పాట్లు రోజురోజుకు వర్ణనాతీతం. తూర్పుగోదావరి జిల్లాలోని ర్యాంపులు, స్టాక్‌పాయింట్లలో నోశ్యాండ్ అంటూ ఆన్‌లైన్‌లో చూపిస్తుండగా, ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట స్టాక్‌పాయింట్‌కు సంబంధించి ఇసుక బుకింగ్ కాని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచినా ఇసుక సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలంలో చేబ్రోలు స్టాక్‌పాయింట్, కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట, వింజరం స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక సరఫరా జరుగుతుందని జిల్లా అధికారులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు లేవని, తూర్పుగోదావరి జిల్లాలో పెరవలి, నిడదవోలు, రావులపాలెంలో ఉన్న స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక తెచ్చుకోవచ్చునని చెప్పుకొచ్చారు. చేబ్రోలు స్టాక్‌పాయింట్‌లో తొలి నుంచి ఇసుక లేకుండాపోయింది. ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్‌లో ఇసుక జనాలకు అందుబాటులోకి లేకుండాపోయింది. ఇసుక ఎటు పోతుందో ఏఒక్కరికీ అర్థం కాని మిస్టరీగా మారింది. జనం నుంచి తీవ్ర విమర్శలు రావడంతో సెప్టెంబర్ 19 నుంచి ఇసుక ఆన్‌లైన్‌లో బుకింగ్ విధానం తెచ్చారు. అయినప్పటికీ సామాన్యులకు ఇసుక అందని పరిస్థితి నెలకొంది. ఎప్పుడు చూసినా ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ అయిపోయినట్లు చూపిస్తోంది. దీంతో జనాలకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇబ్రహీంపేట పాయింట్‌లో ఇంకా 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇసుక మాత్రం బుకింగ్ కావడం లేదు. ఏదేమైనా ఇదిగిదే రోజుకు 800 మెట్రిక్ టన్నుల వరకూ మాత్రమే బుకింగ్ జరుగుతుందని, ముందుగానే అంతా బుక్ అయిపోతుందని చెబుతున్న పరిస్థితి. ఆన్‌లైన్ బుకింగ్ అంతా ఒక మాయాపర్వంలా సాగుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇసుక లేక సామాన్యులకు సంబంధించిన ఇంటి నిర్మాణ పనులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. భవన నిర్మాణ కార్మికులకు నెలలో సగం రోజులు కూడా పని ఉండటం లేదు. ఇసుక సమస్య ఎప్పటికి తీరుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

ఒక్క ర్యాంపూ ఓపెన్ కాని పరిస్థితి

ఈ నెల 16వ తేదీ నుంచి ఓపెన్ ఇసుక రీచ్‌లు అందుబాటులోకి వస్తాయని, ఇసుక కష్టాలు ఇక ఉండబోవని ప్రభుత్వం చెప్పింది. ఈ నెల 16వ రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఇసుక ర్యాంపులు ఓపెన్ చేసినట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలోని పోలవరం మండలంలో గూటాల, పట్టిసీమల్లో ఇసుక ర్యాంపులు ఉన్నాయి. వీటిలో ఒక్కటి కూడా ఓపెన్ కాలేదు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలంలో కరుగోరుమిల్లి, కోడేరు ర్యాంపులు, పెనుగొండ మండలం సిద్ధాంతంలోని రెండు ర్యాంపులు, నడిపూడి ఇసుక ర్యాంపు ఏదీ ఓపెన్ కాలేదు. స్టాక్ పాయింట్లలో ఇసుక దొరక్క, ఓపెన్ రీచ్‌లు తెరవకపోవడంతో ఇసుక సమస్య తీవ్రతరమైంది.

బ్లాక్‌లో ఇసుక అమ్మకాలు..

ఆన్‌లైన్ బుకింగ్‌లో సామాన్యులకు ఇసుక దొరకడం లేదు. బ్లాక్‌మార్కెట్‌లో మాత్రం ఇసుక అమ్మకాలు సాగుతున్నాయి. జిపిఎస్ విధానం ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మరి ఇసుక బ్లాక్ మార్కెట్లోకి ఎలా వస్తుందో అధికారులు చెప్పాల్సి ఉంది. 20 టన్నుల ఇసుక రూ.29 వేలకు బ్లాక్‌మార్కెట్‌లో అమ్మకాలు సాగుతున్నాయి. దీంతో ఇదేం ఉచిత ఇసుక విధానం అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముందుకొచ్చిన సముద్రం



నరసాపురం: చినమైనవానిలంకలో ముందుకొచ్చిన సముద్రపు నీరు

ప్రజాశక్తి - నరసాపురం

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం చినమైనవానిలంక, పెదమైన వానిలంక గ్రామాల్లో సముద్రం వంద మీటర్లకుపైగా ముందుకు చొచ్చుకొచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గురువారం ఉదయం కడలి పోటెత్తింది. సాధారణంగా పౌర్ణమి, అమావాస్యలకు సముద్ర పోటు ఎక్కువగా ఉంటుంది. దీనికితోడు అల్పపీడన ప్రభావంతో సముద్రపు అలలు ఉధృతంగా మారాయి. తీరంలో సాగు చేస్తున్న రొయ్యల చెరువుల్లోకి సముద్రపు నీరు చేరిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం, కెపిపాలెం బీచ్‌ల్లోకి సముద్రపు అలలు ఎగసిపడ్డాయి. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా సముద్రం పోటెత్తిన సంగతి తెలిసిందే. సుమారు 50 మీటర్లు మేర సముద్రం ముందుకొచ్చింది. దీంతో బీచ్‌లోని దుకాణాల్లోకి సముద్రపు నీరు చేరింది. దీంతో ప్రజలు భయాందోళన చెందారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

డిఇఒ కార్యాలయం వద్ద ధర్నాలో

పిడిఎఫ్ టీచర్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి



వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు ఆందోళనలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమని, ఇప్పటికైనా పాలకులు సమస్యలను పరిష్కరించాలని పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బి.గోపీమూర్తి విమర్శించారు. స్థానిక డిఇఒ కార్యాలయం ఎదుట గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు జిఒ 117 రద్దు చేసి ప్రమోషన్లు, బదిలీలు ఇవ్వాలన్నారు. వారు దాచుకున్న పిఎఫ్ సొమ్మును వెంటనే వారికి చెల్లించాలన్నారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్న సౌకర్యాలు అన్ని మున్సిపల్ ఉపాధ్యాయులకు కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సీనియర్ ప్రధానోపాధ్యాయులకు మున్సిపాల్టీలో ఉన్న డిఐ పోస్టుకు ప్రమోషన్ కల్పించాలన్నారు. హైస్కూళ్లలో ఉన్న సెకండరీ పోస్టులను వెంటనే అప్‌డేట్ చేసి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వాలు మారినా వారి సమస్యలు అలాగే ఉన్నాయని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని అన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టి డైరెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామ భద్రం మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటాన్ని సాగిస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌ఛార్జి డిఇఒ, ఆర్‌జెడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కె.రాజశేఖర్, మాణిక్యాల రావు, కుమార్, రాంజీ కుమార్, త్రినాథ్, మల్లేశ్వరరావు, గోవింద్, పెద్దిరాజు, రాంజీ అంబేద్కర్, శ్రీనివాస్, కడలి వెంకటేశ్వరరావు, గూడూరు వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య మద్యం దుకాణాలు వద్దు

కలెక్టర్‌కు ఐద్వా ఆధ్వర్యాన వల్లూరు ప్రాంత వాసుల వినతి



కలెక్టర్‌కు వినతి అందిస్తున్న మహిళలు, ఐద్వా నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఆచంట మండలం వల్లూరు పంచాయతీ పరిధిలోని గెద్దాడవారి పాలెంలో నివాసాల మధ్య పెడుతున్న మద్యం దుకాణాన్ని తొలగించాలని ఆ గ్రామస్తులు జిల్లా కలెక్టర్ నాగరాణికి ఐద్వా ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు ఎం.సరోజిని మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం దుకాణాలకు లైసెన్సులు ఇవ్వడం దారుణమన్నారు. దీనివల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డునపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం కొత్త జీవితాలకు బాటలు వేస్తుందనుకుంటే మద్యం పరవళ్లు తొక్కించడం సిగ్గుచేటన్నారు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. నివాసాల మధ్య మద్యం దుకాణం ఉండటం వల్ల మహిళలు, విద్యార్థులు, పిల్లలు తీవ్ర ఆందోళనకు గురవుతారన్నారు. ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ పక్కనే పంట బోదె ఉందని, మందుబాబులు సీసాలు ఆ బోదెలో పడేయడం వల్ల రైతులు, వ్యవసాయ కూలీలు గాయాల పాలవుతారని చెప్పారు. తక్షణం అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు ఆపాలని కోరారు.

ఆచంట: వల్లూరులో నివాసాల మధ్య మద్యం దుకాణం తక్షణమే తొలగించాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. తక్షణమే ఆ వైన్‌షాపును తొలగించాలని కోరుతూ గురువారం తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు వల్ల కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు అరుంధతీపేటకు చెందిన సుమారు 250 కుటుంబాలు, రైతులకు అనేక ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. తక్షణమే ఆ మద్యం దుకాణాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాల క్రితం ఇదే పరిధిలో వైన్‌షాప్ పెట్టారని, మహిళలు, రైతులు ఇబ్బందులకు గురి కావడంతో అధికారులు దిగొచ్చి అక్కడ నుంచి వైన్‌షాపును వేరేచోటికి తరలించారని తహశీల్దార్‌కు వివరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తక్షణం అక్కడ మద్యం దుకాణం తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కె.సుబ్రహ్మణ్యం, ఎన్.వెంకటేశ్వర్లు, బోళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండలో నిరసన

పెనుగొండ: పెనుగొండలోని సీతారాంపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలని ఆ ప్రాంత ప్రజలు గురువారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దీనిపై ఇప్పటికే ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణకు ఫిర్యాదు చేశామని, అయినా గురువారం దుకాణం ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.అనితకుమారితో సిపిఎం నాయకుడు షేక్ పాదుషా మాట్లాడుతూ నివాస ప్రాంతాలకు దూరంగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పిల్లి గంగ, అక్కవరపు రమావతి, మంగ, దుర్గ, లంక లక్ష్మి, నడిపూడి లక్ష్మి పాల్గొన్నారు.

సదరం శిబిరాలు వినియోగించుకోవాలి

కలెక్టర్ నాగరాణి




ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఏర్పాటు చేసిన సదరం శిబిరాలను విభిన్నప్రతిభావంతులు సద్వినియోగం చేసుకుని సదరం ధ్రువపత్రాన్ని పొందాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. విభిన్న ప్రతిభావంతులకు ఇబ్బంది లేని విధంగా శిబిరాల్లో సౌకర్యాలు కల్పించాలని, అత్యంత పారదర్శకంగా శిబిరాల నిర్వహణ ఉండాలని సూచించారు. తణుకు జిల్లా ఆస్పత్రిలో ఎముకలు, కండరాలు వైకల్యం, కంటి వైకల్యం, మూగ, చెముడు వైకల్యం, మానసిక వికలాంగత్వ పరీక్షలకు మంగళ, శుక్రవారాల్లో శిబిరాలు నిర్వహిస్తారన్నారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఎముకలు, కండరాల వైకల్యం, కంటి వైకల్యం పరీక్షలకు మంగళ, శుక్రవారాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భీమవరం ఏరియా హాస్పిటల్‌లో ఎముకలు, కండరాల వైకల్యం పరీక్షలకు సోమవారం, నరసాపురం ఏరియా ఆసుపత్రిలో బుధవారం, పాలకొల్లు ఏరియా ఆసుపత్రిలో బుధవారం శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆకివీడు, ఆచంట సిహెచ్‌సిల్లో బుధవారం శిబిరాలు నిర్వహిస్తారని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నూరుశాతం అక్షరాస్యత సాధించాలి

డిఆర్ఒ ఉదయభాస్కర్‌రావు



మాట్లాడుతున్న డిఆర్ఒ ఉదయభాస్కర్‌రావు

ప్రజాశక్తి - భీమవరం

నూరుశాతం అక్షరా స్యత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నూతన అక్షరాస్యత కార్యక్రమాన్ని చేపట్టిందని, దీన్ని జిల్లాలో అమలుకు అన్ని చర్యలూ తీసుకోవాలని డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కన్వర్జెన్సీ కమిటీ సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులు, ఆయాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేసే నైట్ వాచ్‌మెన్‌లను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు దృష్టి సారించాలన్నారు. సాయంత్రం ప్రైమరీ స్కూల్స్ భవనాల్లో తరగతులను నిర్వహించాలని, ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సెక్రెటరీ నోడల్ అధికారిగా వ్యవహరించాలని తెలిపారు. మండలాల వారీగా అక్షరాస్యత లక్ష్యాలను నిర్దేశించి ప్రైమరీ స్కూల్స్ భవనాలను అందుబాటులో ఉంచి శిక్షణ ఇవ్వాలని కోరారు. జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. విఒఎలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ద్వారా వాలంటీర్ టీచర్లను, నేర్చుకునే వారిని గుర్తించాలని చెప్పారు. వాలంటీరు టీచర్లు ఉల్లాస్ యాప్ ద్వారా నేర్చుకునే వారి పేర్లను నమోదు చేయాలన్నారు. సమావేశంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జి.సిహెచ్.ప్రభాకర్, కమిటీ సభ్యులు డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిఇఒ జి.నాగమణి, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, డిపిఆర్ఒ టి.నాగేశ్వరరావు, డిపిఒ బి.అరుణశ్రీ, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి పాల్గొన్నారు.

దేశం, రాష్ట్రానికి పట్టుకొమ్మలు పల్లె సీమలు

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు



శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి

ప్రజాశక్తి - యలమంచిలి

దేశం, రాష్ట్రానికి పట్టుకొమ్మలు పల్లె సీమలు అని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మండలంలోని ఆర్యపేటలో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. మేడపాడులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూ.20 లక్షలతో రెండు చోట్ల సీసీ రోడ్లుకు భూమి పూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ బాపూజీ కలల సాకారం కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమన్నారు. రూ.14 లక్షల కోట్ల లోటు ఉన్నా సంక్షేమం అభివృద్ధికి నిధులు కొరత లేదని, దశలవారీగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి తీరుతామని అన్నారు. ప్రజలు మనోభావాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. నిరుపేదల ఆకలిని తీర్చేందుకు రాష్ట్రంలో 200 వరకూ అన్నా క్యాంటీన్లు ప్రారంభించి, కేవలం పదిహేను రూపాయలకే మూడు పూటలా నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి విద్య ఒక్కటే రాజమార్గమని 16,500 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్సీ ప్రకటించామని అన్నారు. దీపావళి నుండి ఉచిత గ్యాసు సిలెండర్ల మహిళలకు అందజేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని ల్యాండు టైటిల్ యాక్టు రద్దు, రైతులకు ఎగ్గొట్టిన ధాన్యం డబ్బులు మన ప్రభుత్వంలో రైతులకు చెల్లించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇలు పి.శ్రీనివాసరావు, కలవకొలను దుర్గా రామస్వామి, సిహెచ్.వెంకటనారాయణ, రామాయణం త్రిమూర్తులు, జి.వెంకటరత్నం, తహశీల్దార్ జి.పవన్ పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం : కలెక్టర్



నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శ నీయమని వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి 24 వేల శ్లోకాలతో, ఏడు కాండములతో మానవాళికి అద్భుతమైన రామాయణం కావ్యాన్ని అందిచారన్నారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని వాల్మీకి జీవిత చరిత్ర తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి జివిఆర్‌కె ఎస్ఎస్ గణపతిరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ వసతి గహాల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ వర్మకు ఎడ్యుకేటర్ ఎక్సలెన్స్ అవార్డు



ప్రజాశక్తి - భీమవరం టౌన్

అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్) ఎడ్యుకేటర్ ఎక్సలెన్స్ అవార్డు స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఐటి డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ పి.రవికిరణ్‌వర్మకు లభించిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ డాక్టర్ వర్మను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికిరణ్‌వర్మ మాట్లాడుతూ అమెజాన్ వెబ్ సర్వీసెస్ సంస్థ ప్రతియేటా వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన విద్యావేత్తలకు అవార్డులు ప్రదానం చేస్తుందన్నారు. అందులో భాగంగా తనకు ఈ అవార్డుతో పాటు బెస్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోఆర్డినేటర్ అవార్డు కూడా లభించిందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ తమ కళాశాలకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) ఎడ్యు స్కిల్స్ ఇంటర్నషిప్ సమావేశంలో తమ కళాశాలకు జాతీయస్థాయిలో 33వ ర్యాంకు అవార్డు ప్రకటించిందన్నారు. ప్రధానంగా విద్యార్థులకు వివిధ కార్పొరేట్ సంస్థల ద్వారా ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ కోర్సులు అందించి విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడినందుకుగాను ఎఐసిటిఇ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ ఈ అవార్డు తమ కళాశాలకు అందించారన్నారు. ఇదే సందర్భంలో జాతీయస్థాయిలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వంద కళాశాలలకు స్థానం కల్పించగా అందులో తమ కళాశాలను కూడా చేర్చారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కె.నిశాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాలకు ఎఐసిటిఇ ద్వారా జాతీయస్థాయి అవార్డులు తీసుకొచ్చినందుకు కళాశాల సిబ్బందిని అభినందించారు.

బస్టాండ్‌లో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ధర్నా



వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ బస్టాండ్‌లో టాయిలెట్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఏర్పాటు చేయాలని స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద గురువారం సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎటి.సూర్యనారాయణ మూర్తి, ఎ.గోపాలరావుతో సిపిఎం పెనుగొండ శాఖా కార్యదర్శి నాగిశెట్టి గంగారావు మాట్లాడుతూ టాయిలెట్లు లేక మహిళా ప్రయాణికులు, విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉన్న టాయిలెట్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్నందున నూతన సులభ కాంప్లెక్స్ నిర్మించే వరకూ తాత్కాలికగా ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, శీలం ఏసు, రాజమహేంద్రవరపు వెంకటేష్ పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

పెంచిన నిత్యావసరాల ధరలు తగ్గించాలని సిపిఎం పోడూరు శాఖ కార్యదర్శి కాకర వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో కొత్తపేట అంబేద్కర్ బొమ్మ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ నిత్యావసరాల ధరలను అదుపు చేయడంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఒక పక్క ధరలు విపరీతంగా పెరుగుతుంటే రైతు బజార్లను నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. రైతు బజార్లను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసి ప్రజలకు కూరగాయల ధరలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బొంతు శ్రీను, బూరా బత్తుల వెంకట్రావు, రొక్కాల సత్యవతి, గడ్డం మేరీ, దిట్టా శ్రీదేవి, చింతపల్లి రామలక్ష్మి మాట్లాడారు.

పెద్ద కొడుకులా ఉంటా : ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం కష్టసుఖాల్లో పెద్ద కొడుకుగా ఉంటానని, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో గ్రామాలను పూర్తిగా విస్మరించి అభివృద్ధిలో వెనుకబడిపోయేలా చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పల్లెల్లో కనీస అవసరాలు కల్పించడానికి మూడు సంవత్సరాల ప్రణాళికతో ముందుకెళ్తున్నామని, రానున్న మూడేళ్లలో తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు తదితర అవసరాలను తీర్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని, నాయకులను ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరం సర్పంచి ముప్పిడి సూర్యకుమారి, ఆడపా ప్రసాద్, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరివ్వండి : సిపిఎం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం మండలం పెర్కిపాలెం గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరివ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. పెర్కిపాలెం సిపిఎం గ్రామ శాఖ మహాసభ బొక్కా మంగారావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ గ్రామంలో చాలా కాలంగా తాగునీటి నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పంచాయతీ వారు తక్షణం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముందుగా పార్టీ జెండాను తోట నరసింహారావు ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మరణించిన సిపిఎం నాయకులు సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య, ఆర్ఎస్, వలవల శ్రీరామ్మూర్తి తదితరులకు నివాళులర్పించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన నరసింహమూర్తి మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్యం సరిగ్గా లేక రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోందన్నారు. పెర్కిపాలెంలో పరిస్థితులు దిగజారినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదన్నారు. అనంతరం బొర్రా అలుమహేరాజును శాఖ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సభలో బొక్కా కూర్మారావు, బొర్రా పద్మావతి, బొక్కా నాగమణి పాల్గొన్నారు.

భీమవరం : పట్టణంలో ఎనిమిదో వార్డు దిరుసుమర్రుపాలెం శాఖ మహాసభ చెల్లబోయిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినా నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయలేని చేతగాని ప్రభుత్వమని విమర్శించారు. అనంతరం నూతన కార్యదర్శిగా అన్యం రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కంకర దొడ్డి నుండి ఎస్ ని ఎ గుడౌన్ వెళ్లే రహదారిని వెంటనే నిర్మించాలని శాఖ మహాసభ డిమాండ్ చేసింది. మద్దాల రాంబాబు, వి.రత్నరాజు పాల్గొన్నారు.

18 నుంచి రీసర్వే గ్రామ సభలు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలో రిసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ రీసర్వే గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామస్థాయిలో భూములకు సంబంధించి రీసర్వేలో సమస్యలను పరిష్కరించేందుకు రీసర్వే గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్నవారు సదస్సు దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 18న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ గొంది గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, 19న చిట్టవరంలో, 21న చినమామిడిపల్లిలో, 22న సరిపల్లిలో, 23న లిఖితపూడిలో, 24న సీతారామపురంలో, 25న కె.బేతపూడిలో గ్రామ సచివాలయాల వద్ద సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వీరవాసరం : ఈనెల 18 నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో మాత్రమే ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో భూ సమస్యలు మాత్రమే ఈ సదస్సుల ద్వారా పరిష్కరించబడతాయన్నారు. 18న తోకలపూడి, పంజావేమవరంలో, 19న మత్స్యపురిపాలెంలో, 22న బొబ్బనపల్లి, 23న నేలపోగులలో, మడుగుపోలవరంలో, 24న తోలేరులో, 25న మత్స్యపురిలో, 26న అండలూరులో, 29న కొణితివాడలో, 30న రాయకుదురులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉండి: భూ రీసర్వేలో భూ సమస్యలుంటే వెంటనే నేటి నుంచి జరిగే గ్రామసభల దృష్టికి తీసుకొచ్చి, సభలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కావడి నాగార్జున విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రీసర్వేపై ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ప్రజలు తీసుకువెళ్లారని, దీంతో రీసర్వేపై నేటి నుంచి 30వ తేదీ వరకూ గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

పెనుమంట్ర : ఈ నెల 18 నుండి 30వ తేదీ వరకూ ఆరు గ్రామాల్లో గ్రామస్థాయిలో భూములకు చెందిన రీ- సర్వే సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ వై.రవికుమార్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. 18న నత్తారామేశ్వరం, 22న సోమరాజు ఇల్లింద్రపర్రు, 24న వెలగలేరు, 26న జుత్తిగ, 29న మల్లిపూడి, 30న మాముడూరు గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అగ్రిసెట్‌లో మార్టేరు విద్యార్థుల హవా

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆగస్టు నెల 27వ తేదీన నిర్వహించిన అగ్రిసెట్-2024 పరీక్షా ఫలితాల్లో మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు 2, 4, 14 ర్యాంకులు సాధించి రికార్డ్ సృష్టించారు. ఈ మేరకు గురువారం వివరాలను అందించారు. స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు మట్టా లావణ్య 2వ ర్యాంకు, పి.జాహ్నవి 4వ ర్యాంకు, జిక్కి.ఉషాకిరణ్ 14వ ర్యాంకులు సాధించి విశేష ప్రతిభ కనబర్చారని, రాష్ట్రవ్యాప్తంగా 2, 4, 14 ర్యాంకులు సాధించారని వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్, పరిశోధనా సహ సంచాలకులు డాక్టర్ టి. శ్రీనివాస్ గా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్రిసెట్-2024 ఫలితాలను విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి లాంఛనంగా విడుదల చేశారని, ఆ ఫలితాల్లో మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రంలో మొదటి స్థానాలలో నిలవటం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 1469 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 1447 మంది అర్హత సాధించారని తెలిపారు. మార్టేరు నుండి అగ్రిసెట్- 2024 కు 32 మంది విద్యార్థులు హాజరు కాగా 100 లోపు 11 మంది, 200లోపు 17 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని కళాశాల వైస్ ప్రిన్సిపల్ నామాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వ్యవసాయ పాలిటెక్నిక్ బోధనా బోధనేతర సిబ్బంది విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.

శేరేపాలెంలో 30న గ్రామసభ

ప్రజాశక్తి - మొగల్తూరు


మండలంలోని శేరేపాలెంలో ఈ నెల 30వ తేదీన రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నామని తహశీల్దార్ కె.రాజ కిషోర్ తెలిపారు. సమగ్ర సర్వే నిర్వహించిన గ్రామాల్లో సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించనున్న ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఊరికి ఉపకారి..

సేవా కార్యక్రమాలు చేస్తూ మన్ననలు పొందుతున్న టిడిపి గ్రామ అధ్యక్షులు కృష్ణమూర్తి



జనార్ధనస్వామికి రూ.15 లక్షల విలువైన వెండి వక్షస్థలాన్ని బహూకరించిన దాతలు



మందపాటి రామారావు, సావిత్రి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కాళ్ల

బొండాడ గ్రామ రైతుగా, టిడిపి గ్రామ అధ్యక్షుడిగా ఉంటూ ఊరిలో పది మందికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందువరుసలో ఉన్నారు. ఎన్నో విద్య, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేశారు. ఆయన మరెవరో కాదు బొండాడ టిడిపి గ్రామ అధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి. తన వంతు సాయం అందజేస్తూ అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నారు.

తాత పేరుతో సేవా కార్యక్రమాలు..

మందపాటి రామారావు - సావిత్రి జ్ఞాపకార్థం వారి కుమారులు మందపాటి విశ్వేశ్వరరావు, కోటేశ్వరరావు (లేటు), వెంకన్న వారి సహకారంతో మందపాటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జనార్ధన స్వామికి రూ.15 లక్షల విలువైన వెండి వక్షస్థలాన్ని బహూకరించారు. తాత మందపాటి రామారావు పేరుతో మందపాటి కృష్ణమూర్తి గ్రామంలో తన వంతు సాయం చేస్తున్నారు. చర్చి నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు. వినాయకుడి గుడి షెడ్డు నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం అందజేశారు. బొండాడ గ్రామానికి చెందిన వనమాల అప్పారావు, పద్మకు దినేష్, హేమంత్ కుమారులు ఉన్నారు. వనమాల అప్పారావు గుండెపోటుతో చనిపోయారు. వనమాల పద్మ అనారోగ్యంతో మృతి చెందారు. దినేష్ ఐటిఐ, హేమంత్ ఏడో తరగతి చదువుతున్నాడు. దీంతో టిడిపి గ్రామ అధ్యక్షులు మందపాటి కృష్ణమూర్తి ఒక్కొక్కరికీ రూ.500 చదువు నిమిత్తం ప్రతి నెలా తన వంతు సహకారం అందిస్తున్నారు.

సేవా కార్యక్రమాలంటే ఎంతో ఇష్టం

మందపాటి కృష్ణమూర్తి, టిడిపి బొండాడ గ్రామ అధ్యక్షుడు



నాకు సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో ఇష్టం. మొదట ఆధ్యాత్మిక సేవలో ప్రతి రోజూ పాల్గొనే వాడిని. జనార్ధనస్వామికి వెండి వక్షస్థలాన్ని దాతల సహకారంతో అందించాం. ప్రతి ఒక్కరికీ చదువు అవసరం. దినేష్ ఐటిఐ, హేమంత్ విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తున్నాం. సమాజ సేవకు ప్రాధాన్యం ఇచ్చాను. టిడిపి గ్రామ అధ్యక్షుడిగా పని చేస్తున్నా. పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తా.

గోతులు పూడ్చరా..!

ప్రజాశక్తి - ఆకివీడు

గోతులతో రోడ్లు అధ్వానంగా ఉన్నా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షులు రాష్ట్ర సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆకివీడు నుంచి భీమవరం వెళ్లే ఉండి రైల్వే గేట్ వద్ద ఓవర్ బ్రిడ్జి పనులు నిలిపివేయడం తీవ్ర నిరాశ కలిగిస్తోందన్నారు. ఆ ప్రాంతంలో రైల్వేగేటుపై ఇరువైపులా రోడ్డుపై భారీ స్థాయిలో గోతులు పడ్డాయన్నారు. వర్షం పడితే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయన్నారు. వెంటనే గోతులు పూడ్చి రోడ్డు సరిచేసి ప్రజలను ఆదుకోవాలన్నారు.

గునుపూడిలో అన్నదానం

ప్రజాశక్తి - భీమవరంటౌన్

గునుపూడిలోని ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరు అమ్మవార్ల దసరా మహోత్సవ నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ గొట్టుముక్కల నాగసీతారామరాజు, ఆలయ మాజీ ఛైర్మన్లు బాధరాల పుల్లేశ్వరరావు, వేలూరి సాయి, ఆలయ సేవా సంఘం అధ్యక్షులు కర్రి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు ఉత్తమ సేవలందించాలి

ప్రజాశక్తి - ఉండి

గ్రామ మత్స్య సహాయకులు ఆక్వా రైతులకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలందించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు అన్నారు. గురువారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామ మత్స్య సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్నుద్దేశించి ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ చేపలు, రొయ్యలు వ్యాధులపై యాజమాన్యం అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో వరి తర్వాత అంత ప్రాముఖ్యత ఉన్న పంట ఆక్వా అన్నారు. ఆక్వాసాగుకు పెట్టుబడి ఎక్కువగా ఉంటుందని, ఏదైనా వ్యాధి బారిన పడితే నష్టం అధికంగా ఉంటుందని తెలిపారు. అనంతరం మత్స్యశాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ దేవి వరప్రసాద్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు పి.వినయలక్ష్మి, బి.రజిత, కెవికె సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి హుండీని గురువారం ఆలయ అధికారులు, సిబ్బంది లెక్కించారు. ఆలయ ఖజానాకు 127 రోజులకు గాను రూ.19,36,321 ఆదాయం సమకూరింది. యాత్రికులు స్వామివారి హుండీల్లో వేసిన కానుకలను వెంకటేశ్వరస్వామి కాలక్షేప మండపంలో లెక్కించారు. కార్యనిర్వహణ అధికారులు ఎం.అరుణ్ కుమార్, దండు, వెంకట కృష్ణంరాజు సమక్షంలో హుండీ తెరిచి సిబ్బంది లెక్కించారు.

వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహర్షి వాల్మీకిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ పి.రాధిక తెలిపారు. గురువారం మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిధిలోని వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ఆదికవి మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్, ఎడిఆర్ ఇన్‌ఛార్జి పి.రాధిక, వైస్ ప్రిన్సిపల్ ఎన్.శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మొదటగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్, ఎడిఆర్ ఇన్‌ఛార్జి పి.రాధిక మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, సిబ్బంది వ్యవసాయ పాలిటెక్నిక్ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : మహోన్నత వ్యక్తి వాల్మీకి అని ఎంపిడిఒ విశ్వనాథ్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ విశ్వనాథ్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి ఎం.వెంకటేష్, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించి మాట్లాడారు. వాల్మీకి కిరాతకుడు కాదని మంచి స్వాభావిక లక్షణాలు కలవాడని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, సిహెచ్ చైతన్య, ఎన్ఎస్ఎస్ పిఒలు జి.వెంకటరమణ, పి.భాస్కరరావు, కె.స్వరూపరాణి, బాల మణికంఠ, విద్యార్థులు కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడుతూ వాల్మీకి రామాయణంలో, వారధి నిర్మాణంలో భక్తితో ఉడుత చేసిన సేవ అద్భుతమైందన్నారు. వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నోబుల్ రాజ్, మమత, రేవతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ రథోత్సవం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఐదు రాష్ట్రాలకు చెందిన 250 మంది కళాకారులతో వాసవీ మాత రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర పురవీధుల్లో తిరుగాడుతున్న ఏకైక వెండి రథం ఇక్కడే ఉండడం అదృష్టమన్నారు. గౌరవ అధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం ఆర్యవైశ్య సంఘం పూర్వాధ్యక్షులు పేరూరి కాశయ్య, గ్రంధి సత్యనారాయణ, డైరెక్టర్లు సింహపురి మల్లి, ఆలపాటి అచ్యుతలక్ష్మి, నున్న శ్రీ నాగలక్ష్మి రథోత్సవ కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షించారు.

ఉన్నత విద్యతోనే ఎక్కువ అవకాశాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భారతీయ విద్యార్థులు యుఎస్ఎలో ఉన్నత విద్యనభ్యసిస్తే ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని నిట్ స్టూడెంట్స్ క్యారీర్ అలుమ్మీ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ డాక్టర్ కార్తీక్ శేషాద్రి సూచించారు. నిట్‌లోని ట్రెయినింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్, అలుమ్మీ ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఇన్విక్టా కెరీర్ కన్సల్టెన్సీ సంయుక్త ఆధ్వర్యంలో అమెరికాలోని తొమ్మిది ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో గురువారం హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెయినింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ అసోసియేట్ డీన్‌లు డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ జి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ యుఎస్ఎలో ఉన్నత విద్యను అభ్యసించాలని చాలామంది విద్యార్థులు కలలు కంటారు, గానీ ఏ విశ్వ విద్యాలయంలో ఎటువంటి కోర్సులు అందుబాటులో ఉంటాయి, వసతులు, సౌకర్యాలు వంటి విషయాలు తెలియక ఎంతోమంది వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. యుఎస్ఎ వెళ్లి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలనుకునే విద్యార్థులకు ఈ ఫెయిర్ ఎడ్యుకేషన్ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఇన్విక్టా కెరీర్ కన్సల్టెన్సీ డైరెక్టర్ (విజయవాడ) డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇల్లినాయిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (చికాగో) సలహాదారు సాక్షి మెరుగు, శాన్ జోష్ స్టేట్ యూనివర్సిటీ కాలిపూర్ణయ ఇండియా కంట్రీ కోఆర్డినేటర్ కరుణ విశ్వకరన్, కుమార్, పాల్గొన్నారు.

మున్సిపల్ డిఇగా ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి - నరసాపురం

మున్సిపల్ డిఇగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయవాడ కార్పొరేషన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన డిఇ రమేష్ విజయవాడ బదిలీ అయ్యారు. ఇటు మున్సిపల్ రెండో ఎఇగా పి.దుర్గాకిషోర్ బాధ్యతలు చేపట్టారు. ఆయన కొవ్వూరు నుంచి బదిలీపై వచ్చారు. ఈ స్థానంలో పని చేసిన సునీల్ రామచంద్రపురం బదిలీ అయ్యారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అఖిల్‌వర్మ ఎంపిక

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదుతున్న ఎం.అఖిల్‌వర్మ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఎం.పద్మావతి గురువారం తెలిపారు. ఏలూరు సీతారామ స్టేడియం వద్ద ఉమ్మడి జిల్లా అండర్ - 14 వాలీబాల్ ఎంపికలో వర్మ ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికైన వర్మను హైస్కూల్ హెచ్ఎం మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇరిగేషన్ పనులు పూర్తి : జెసి

ప్రజాశక్తి - నరసాపురం

రైతులకు, ముంపు గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరేలా వివిధ ఇరిగేషన్ పనులను చేపట్టి పూర్తి చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ నరసాపురం మండలం దర్భరేవు డ్రెయిన్‌కు సంబంధించి రూ.23 లక్షలతో చేపట్టిన పూడికతీత పనులు, యలమంచిలి మండలం కాజా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు సంబంధించి రూ.20 లక్షలతో చేపట్టిన షట్టర్ పనులు, రుస్తుం బాధ మీడియం డ్రైన్, నత్తలావ మైనర్ డ్రైన్ కు సంబంధించి రూ.7.70 లక్షలు, బియ్యపు తిప్ప గ్రామంలో నల్లిక్రిక్ బండ్ పనులు రూ.12 లక్షలతో చేపట్టిన పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సంబంధించిన శాఖల అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పనులకు సంబంధించిన నిధులను గత సంవత్సరం నవంబర్ నెలలో పూర్వపు కలెక్టర్ ఎమర్జెన్సీ నిధుల నుండి మంజూరు చేయడం జరిగిందని ఇరిగేషన్ శాఖ అధికారులు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి వివరించారు. ఆయన వెంట ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ టి.రాజేశ్వరి, పాలకొల్లు తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, గోదావరి హెడ్ వర్క్ డివిజన్ కె.కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించండి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తణుకు

ప్రయివేటు స్థలాల్లో పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగిపోయాయని, వాటిని తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 29వ వార్డులో గురువారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని తక్షణం పరిష్కరించేందుకు గ్రామ దర్శిని కార్యక్రమం దోహదపడుతుందన్నారు. 29వ వార్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, వార్డులో ఉన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అధికారులతో వాటి పరిష్కారాలు చూపే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు,మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయలు వర్ధంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

అష్టదిగ్గజాలను తన కొలువులో నిలిపిన కవి సార్వభౌముడు, ఓటమి ఎరుగని వీరాధివీరుడు శ్రీకృష్ణ దేవరాయలు అని శ్రీకృష్ణ దేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం అన్నారు. గురువారం జరిగిన రాయల్ 495వ వర్ధంతి సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో మాట్లాడారు. హరివిల్లు వ్యవస్థాపక అధ్యక్షులు వంగా నరసింహారావు, ముచ్చర్ల శ్రీరామ్ పాలకొల్లు లోని రాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండెల రజనీ, ఇనుకొండ శేషాద్రి, రాయి సూరిబాబు, బోనం చినబాబు, చవ్వాకుల నరేష్ పాల్గొన్నారు.

వర్షాలతో అన్నదాత ఆందోళన



నేలకొరిగిన వరిచేను

ప్రజాశక్తి - ఆచంట

అల్పపీడన ప్రభావంతో వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలు రైతులను వణికిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా కోత దశలో ఉన్న ఎంటియు 1318 రకం వరిచేలు సుమారు 10 ఎకరాల వరకూ నేలనంటాయి. పడిపోయిన వరి దుబ్బులను నిలబెట్టేందుకు అదనపు ఖర్చు అవుతుందని రైతులు చేకూరి వెంకటేశ్వరరావు, గంగారాం, సత్యనారాయణ లబోదిబోమంటున్నారు. భారీ వర్షంతో చేతికందొచ్చిన పంట నేలకొరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.25 నుంచి రూ.28 వేల వరకూ పెట్టుబడులు పెట్టామని, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహాలో పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని రైతులు వాపోతున్నారు. నేలకొరిగిన పంట పొలాలపై సుడిదోమ, కాండం కుళ్ళు, మాగుడు వంటి తెగుళ్లు విజృంభిస్తాయని, దీనికి మరో అదనపు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. దీనిపై వ్యవసాయాధికారి బి.నాగరాజును వివరణ కోరగా మండలంలో సుమారు ఎనిమిదెకరాల వరకూ వర్షాలు, ఈదురుగాలుల వల్ల నేలకొరుగుతున్నట్లు తెలిపారు. నేలకొరిగిన పంటను నాలుగైదు దుబ్బులు కలిసి ఒక కట్టగా కట్టుకొని నిలబెట్టుకోవాలన్నారు. ఈ దశలో పంటపై ఎటువంటి పురుగు మందులు పిచికారీ చేయొద్దని సూచించారు.

19, 20 తేదీల్లో జెఎన్‌టియుకె బ్యాడ్మింటన్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు

భీమవరంటౌన్ : ఈ నెల 19, 20 తేదీల్లో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జెఎన్‌టియు కె 'మెన్ అండ్ ఉమెన్' సెంట్రల్ జోన్ టోర్నమెంట్ జరుగుతుందని కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ కళాశాల ఎప్పుడూ క్రీడలకు ప్రాధాన్యతిస్తుందన్నారు. వీటితోపాటు ఈ నెల 26, 27 తేదీల్లో బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ 'మెన్ అండ్ ఉమెన్ సెంట్రల్ జోన్ పోటీలు కూడా తమ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.సురేష్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యనారాయణ రాజు మాట్లాడారు. గతేడాది కూడా తమ కళాశాలలో క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం

ఆచంట: అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడం ద్వారా మాతాశిశు మరణాలను తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంతో పనిచేస్తోందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం పోడూరు మండలం పండిత విల్లూరు గ్రామంలో ఎస్‌సి, బిసి ఏరియాలో రూ.27 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తహీనతను తగ్గించేందుకు స్త్రీలు బాలికలు పౌష్టికాహారంతో పాటు మందులు సరఫరా చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఇళ్ల లక్ష్మీచంద్రిక, ఎంపిపి కుసుమే సుమంగళి, మాజీ సర్పంచి కోరిపల్లి రామచంద్రరావు పాల్గొన్నారు.